



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

శనివారం 26 జులై 2025 పేజీలు 8


## విజయవాడ, విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టులను

# మూడేళ్లలో పూర్తి చేస్తాం



- విజయవాడ మెట్రో రైల్‌కు నేడో, రేపో టెండర్లు పిలుస్తాం
- మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి పి. నారాయణ

**విజయవాడ, జులై 25, మేజర్ న్యూస్ :** మెట్రో రైల్ ప్రాజెక్ట్ ను రానున్న మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. శుక్రవారం లెనిన్ సెంటర్‌లోని సీఆర్డీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ 2014 ఏపీ రీఆర్గనైజేషన్ యాక్ట్ ప్రకారం విశాఖపట్టణం, విజయవాడలలో మెట్రో రైల్ ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉందన్నారు. ఫీజుబుల్టీ రెపోర్టు స్టడీ చేయడానికి ఆరు నెలలు సమయం పట్టిందన్నారు. కేంద్రం అనుమతించిన మేరకు మెట్రో రైల్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ముందుగా విశాఖపట్టణంలో మెట్రో రైల్ కు


2



### 15 రోజుల్లోగా ఆర్టీజీఎస్ లాగిన్‌లో

# అప్లోడ్ చేయాలి

### కృష్ణాజిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు వారి సర్కులర్లు, చట్టాలు, నియమాలు తదితర డాక్యుమెంట్లు 15 రోజుల్లోగా ఆర్టీజీఎస్ లాగిన్‌లో అప్లోడ్ చేయాలని మిగతా 2లో

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రైతులకు గిట్టుబాటు ధరలు, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందేలా చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులకు రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దిశా నిర్దేశం చేశారు. మచిలీపట్నంలోని క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని రైతుబజార్లలో సదుపాయాలు మెరుగుపరచాలన్నారు. రైతు బజార్లకు విస్తృతమైన ప్రచారం కల్పించాలని సూచించారు. మరోవైపు రోడ్లపై పశువుల మిగతా 2లో...

# కృష్ణా జిల్లాను రాష్ట్రానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుదాం

- రోడ్లపై తిరిగే పశువుల్ని క్యాటిల్ షెడ్లకు తరలించాలి
- రైతు బజార్లలో సదుపాయాలు కల్పించాలి
- వ్యవసాయ మార్కెటింగ్ అధికారులతో సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర

# ఆవిష్కరణల్లో జిల్లాను నెం.1 నిలిపేందుకు కృషి



- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో స్టార్టప్‌లకు సరికొత్త ఊపు
- వివిధ సమస్యలకు అందరికీ అందుబాటులో ఉండే పరిష్కారాలు
- జిల్లాకు ఆర్‌టీఐహెచ్ స్పోక్‌ను కేటాయించినందుకు సీఎంకి కృతజ్ఞతలు
- విద్యార్థులు, యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకూ చొరవ
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జులై 25, మేజర్ న్యూస్ :** రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్), స్పోక్స్ ద్వారా స్టార్టప్‌లకు కొత్త ఊపు రానుందని.. మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)



## కృష్ణా జిల్లాను రాష్ట్రానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుదాం

సంచారాన్ని నిర్మూలించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరం మేరకు క్యాటిల్ షెడ్లకు పశువుల్ని తరలించి వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. రోడ్లపై తిరిగే పశువుల రైతులకు కూడా అవగాహన కల్పించాలన్నారు.అనంతరం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పీ4 కార్యక్రమ ప్రత్యేక అధికారులు ఎంపీడీవో, మార్కెటింగ్ ఏడీతో చర్చించారు. పథకం అమలు, మార్గదర్శులు, బంగారు కుటుంబాల ఎంపిక గురించి అడిగి తెలుసుకున్నారు. పీ4 కార్యక్రమం అమలులో జిల్లాను రోల్ మోడల్ గా మార్చాలని, అధికారులు ఈ విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ కుంచె నాని, అధికారులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆవిష్కరణల్లో జిల్లాను నెం.1గా నిలిపేందుకు కృషి




ఈ స్పోక్‌ను సద్వినియోగం చేసుకుంటూ జిల్లాను ఆవిష్కరణల్లో నెం.1గా నిలిపేందుకు కృషి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టరే ట్ ప్రాంగణంలో శుక్రవారం వివిధ స్టార్టప్ కంపెనీలు ఏర్పాటుచేసిన స్టాళ్లను కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతలకు, కొత్త ఆవిష్కరణలకు రాష్ట్రాన్ని వేదికగా తీర్చిదిద్దేందుకు అమరావతిలో రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్ ఏర్పాటు చేయడం జరుగుతోందని.. దీనికి అనుసంధానంగా రాష్ట్రంలో అయిదు ప్రాంతాల్లో స్పోక్స్‌లను కేటాయించడం జరిగిందని. ఎన్‌టీఆర్ జిల్లాకు కూడా ఒక స్పోక్‌ను కేటాయించినందుకు గౌరవ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. విజయవాడలోని ఎనికేపాడులో రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్ స్పోక్‌ను త్వరలోనే గౌరవ ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని.. ఈ నేపథ్యంలో సన్నద్ధతలో భాగంగా ట్రయల్‌రన్‌గా కలెక్టరేట్ ప్రాంగణంలో దాదాపు 62 స్టార్టప్‌లు తమ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, లిక్విడ్–సాలిడ్ వేస్ట్ రీసైకిలింగ్, డ్రోన్స్ యూజ్ కేసులు, అగ్రీ టెక్, ఎన్విరాన్ డిజిటల్ వంటి సొల్యూషన్స్‌ను ప్రదర్శించినట్లు వివరించారు. సమాజంలో నిత్య జీవితంలో ఎదురయ్యే వివిధ సమస్యలకు అందరికీ అందుబాటులో ఉండేలా కళాశాల విద్యార్థులు, యువత కొత్త ఆలోచనలతో ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నారని, వీరికి అన్ని విధాలా ఆర్‌టీఐహెచ్ హబ్, స్పోక్స్‌ల ద్వారా మద్దతు లభిస్తుందన్నారు. చాలా తక్కువ ఖర్చులో అందరికీ అందుబాటులో ఉండే టెక్ సొల్యూషన్స్‌ను ప్రోత్సహించి.. వివిధ పథకాలను సద్వినియోగం చేసుకునేలా, బ్యాకింగ్ మద్దతుకు సహాయసహకారాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే కలెక్టరేట్‌లో ఇగ్నైట్ సెల్ ద్వారా వివిధ శాఖల పరిధిలో అందుబాటులో ఉన్న పథకాలు, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు మార్గాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, సరికొత్త ఆవిష్కరణలు దిశగా నడిపించేందుకు రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్ దోహదం చేస్తుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. వివిధ స్టార్టప్ సంస్థల ప్రతినిధులు, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు పాల్గొన్నారు.

## దేవి ఆలయాల్లో శ్రావణమాస మహోత్సవాలు



**నందిగామ, జూలై 25, మేజర్ న్యూస్:** పట్టణంలోని పలు దేవి ఆలయాల్లో శ్రావణమాసం మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి శుక్రవారం స్థానిక శ్రీ మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయం లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవి శ్రీ చక్ర మందిరంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు గజలక్ష్మి దేవిక భక్తులకు దర్శనమిచ్చింది. శ్రీ చక్ర మందిరంలో అర్చక స్వాములు మణికంఠ పాండే ఆధ్వర్యంలో గణపతి పూజ కలిసస్థాపన, శ్రీ చక్ర నవవర్ణార్చన, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవికి విశేష అర్చనలు పూజలు మూలమంత్ర హోమాది క్రతువులు వేదొక్తంగా నిర్వహించారు. ఆలయాల కమిటీ సభ్యులు సాయంత్రం మహిళలకు పసుపు కుంకుమ గాజులు పువ్వులు పంపిణీ చేశారు.

# విజయవాడ, విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తాం



(మొదటిపేజీ తరువాయి)

టెండర్లు ఇవ్వడం జరిగిందని, నేడో, రేపో విజయవాడ మెట్రోకు టెండర్లు పిలవటం జరుగుతుందన్నారు. కేంద్రం మెట్రో రైల్ నిర్మాణానికి పాలసీ మార్చిందని మారిన పాలసీ ప్రకారం మెట్రో నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. అందుకనుగుణంగా నిన్న జరిగిన కేబినెట్ భేటీలో మెట్రో రైల్ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వాటాగా 20 శాతం, కేంద్రం వాటాగా 20, మిగతాది కేంద్రం అనుమతితో సాఫ్ట్ లోన్ ను 30 సంవత్స రాల కాలపరిమితితో తక్కువ వడ్డీ రేటుకు అంతర్జాతీయ సంస్థల నుంచి కేంద్రం అందించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం పీజుబులిటీ చేపట్టి మెట్రో రైల్ నిర్మాణాన్ని చేపట్టకుండా పక్కన పడేసిందన్నారు. మా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రాజెక్టును చేపట్టడం జరుగుతుందన్నారు. ఇవాళ ప్రపంచవాక్షప్తంగా ట్రాఫిక్ సమస్య ఉందని దానికి పరిష్కారంగా మెట్రో రైళ్ల నిర్మాణాలను బెంగళూరు, హైద్రాబాద్, నాగపూర్ తదితర ప్రాంతాల్లో చేపట్టడం జరిగిందన్నారు. మిక్స్‌డ్ డబుల్డ్ పర్మిషన్స్‌ను ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందని క్రింది అంతుపులో పార్కింగ్, మొదటి అంతస్టులో కమర్షియల్ నిర్మాణాలు, రెండో అంతస్థులో రెసిడెన్షియల్ గా ఉండేలా పర్మిషన్స్ ఇవ్వడంతో వాక్ టూ వర్క్ లా పరిస్థితులు మారిపోతున్నాయన్నారు. జంక్షన్స్ వద్ద ట్రాఫిక్ కు ఏవిధమైన ఆటంకాలు ఏర్పడకుండా మొదటి ఫ్లైఓవర్ పై ట్రాఫిక్ వాహనాలు, రెండో ఫ్లైఓవర్ పై మెట్రో ట్రైన్ వెళ్లేలా నిర్మాణాలు ఉంటాయని దీనివల్ల వాహనదారులకు ఏ విదమైన ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా ప్రయాణించవచ్చున్నారు. విశాఖపట్టణం మెట్రో రైల్ నిర్మాణాలు విశాఖపట్టణం మహానగర అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రెండు పేజీల్లో పనులు చేపట్టడం జరుగుతుందని మొదటి పేజ్ లో మొత్తం 46 కిమీ మెట్రో లైన్ నిర్మాణం 42 స్టేషన్లతో మొత్తం రూ. 11,490 కోట్ల అంచనాతో మూడు క్యారిడార్లలో మెట్రో రైల్ నిర్మాణం. మొదటి కారిడార్‌ను స్టీల్ ప్లాంట్ గేటు నుంచి కొమ్మాది జంక్షన్ వరకు 34.40 కిమీ మెట్రో లైను 29 స్టేషన్ల తో నిర్మాణం... రెండో కారిడార్ గురుద్వారా జంక్షన్ నుంచి ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ వరకు 5.7 కిమీ మెట్రో లైను ఆరు స్టేషన్ల తో నిర్మాణం, కారిడార్ మూడు ను తాడిచెట్ల పాలెం నుంచి చినవాల్తేరు వరకు 6.75 కిమీ మెట్రో లైను 7 మెట్రో స్టేషన్లతో నిర్మాణాలు చేపట్టనున్నారు. విజయవాడ మెట్రోను రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్డీఏ) ఆధ్వర్యంలో మొదటి పేజ్ ను రూ. 10,118 కోట్ల అంచనా వ్యయంతో 32.40 కిమీ మేర నిర్మాణం. మొదటి కారిడార్‌ను 25.9 కిమీను పండిట్ నెహ్రూ బస్టేషన్ నుంచి గన్నవరం ఎయిర్ పోర్టు వరకు రెండో కారిడార్‌ను పండిట్ నెహ్రూ బస్టేషన్ నుంచి పెనమలూరు వరకు చేపట్టనున్నారన్నారు. విశాఖ, విజయవాడ మెట్రో రైళ్ల నిర్మాణం, పర్యవేక్షణ, సాంకేతిక సహకారం కోసం కన్సల్టెన్సీతో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ రామకృష్ణా రెడ్డిల మధ్య అవగాహన ఒప్పందాన్ని మంత్రి నారాయణ సమక్షంలో ఒప్పందంపై సంతకాలు చేసిన ప్రతినిధులు. విజయవాడ మెట్రో డిజైన్ లు, సాంకేతికత, పనుల పర్యవేక్షణకు టిప్సాతో, విశాఖకు శిస్ట్రా కన్సల్టెన్సీలతో ఎంఓయూ కుదుర్చుకోవడం జరిగింది. అమరావతి రాజధాని రైతులకు జరీబు భూములకు రూ. 50,000, నాన్ జరీబు భూములకు రూ. 30,000 చెల్లించడం జరిగిందన్నారు. 18,638 మంది రైతులకు రూ. 163.67 కోట్లను చెల్లించడం జరిగిందన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని రాజధాని రైతులను కోరారు. బ్యాంకు ఇబ్బులు, ఎకౌంట్స్ ఇబ్బందులతో ఇంకా కొద్దిమందికి డబ్బులు వారి ఎకౌంట్లలో జమ కాకపోయినా త్వరలోనే వాటిని కూడా సరిచేసి అందిస్తామన్నారు. ఏపీ సచివాలయంలో తాత్కాలికంగా పనిచేస్తున్న స్కావెంజర్స్, స్వీపర్స్ కు రాజధాని ప్రాంతంలో అందించే పెన్షన్ ను ప్రభుత్వం ఇచ్చే విదంగా ఆదేశాలు ఇచ్చామన్నారు.

# 15 రోజుల్లోగా ఆర్టీజీఎస్ లాగిన్‌లో అప్లోడ్ చేయాలి



(మొదటిపేజీ తరువాయి)

జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుండి వివిధ శాఖల జిల్లా అధికారులు క్షేత్రాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆర్టిజిఎస్, పి4 సర్వే, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, సచివాలయు ఉద్యోగుల విడుదల, చేరిక, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, ఐ గాట్ కర్మయోగి శిక్షణ, వీధి వ్యాపారుల సర్వే, కాలానుగుణ వ్యాధుల నియంత్రణ తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రియల్ టైం గవర్నెన్స్ సొసైటీ ఆర్ టి జి ఎస్ లాగిన్ లోకి అన్ని ప్రభుత్వ కార్యాలయాల సర్కులర్లు, చట్టాలు, నియమాలు, ఉత్తర్వులు తదితర డాక్యుమెంట్లు తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని ఆదేశించిందన్నారు. ప్రతి జిల్లాకు 3 లక్షల డాక్యుమెంట్లు అప్లోడ్ చేయాలన్నది లక్ష్యం కాగా జిల్లాలో ఇప్పటివరకు కేవలం 3,300 మాత్రమే అప్లోడ్ చేశారన్నారు. ఈ ప్రక్రియను ముమ్మరంగా చేపట్టి వచ్చే 15 రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు.జిల్లాలో ఐ గాట్ కర్మయోగి ఆన్లైన్ శిక్షణ తరగతులు పూర్తి చేయడంలో సరైన పురోగతి లేదని, సి ఎఫ్ ఎం ఎస్ గుర్తింపు సంఖ్య కలిగిన ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఈ నెలాఖరులోగా 15 కోర్సులను తప్పనిసరిగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం పి 4 సర్వే కార్యక్రమాన్ని చాలా ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని దీనిపై ప్రతిరోజు ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 68,000 బంగారు కుటుంబాలను, కేవలం 1817 మంది మార్గదర్శిలను గుర్తించడం జరిగిందన్నారు. నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న వారిని మార్గదర్శిలుగా గుర్తించాలన్నారు. అంతే కాకుండా బంగారు కుటుంబాల ఇంటింటికి తిరిగి వారి అవసరాలను ఏమిటో తెలుసుకుని వచ్చే ఆగస్టు నెల 5 వ తేదీలోగా వివరాలు సేకరించాలన్నారు. రోజుకు కనీసం 10 నుంచి 15% పురోగతి సాధించాల్సి ఉందన్నారు.జిల్లాలో 15వ ఆర్థిక సంఘం నిధులు 1000 కోట్ల రూపాయలు%ఎ% ఉన్నాయని, వాటిని ఖర్చు చేసి నివేదికలు పంపించాల్సి ఉందన్నారు. ఎందుకు ఎంపీడీవోలు తగిన చొరవ చూపి నిధులు ఖర్చు చేయాలన్నారు.ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ముందుగానే బ్యాంకుల నుండి డ్రా చేసుకొని సచివాలయ సిబ్బంది ఆగస్టు ఒకటవ తేదీన పంపిణీకి సిద్ధంగా ఉండాలన్నారు. ఇంకా కొన్ని చోట్ల పింఛన్ల మ్యాపింగ్ సరిగా చేయలేదని వెంటనే దానిపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయాలన్నారు. ఇంకా కొన్నిచోట్ల బదిలీ అయిన సచివాలయ సిబ్బందిని విడుదల చేయలేదని వారిని వెంటనే విడుదల చేయాలని, వారు కొత్త ప్రాంతంలో వెంటనే చేరి ముందుగానే పింఛన్దారులు ఎక్కడ ఉన్నారో తెలుసుకుని పింఛన్లు పంపిణీ సజావుగా జరిగేలా ఒక రూట్ మ్యాప్ తయారు చేసుకోవాలన్నారు. సచివాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో ఒక కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేసుకొని పింఛన్ల పంపిణీ పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో గత కొన్ని రోజులుగా వర్షాలు పడుతున్నాయని, మరో 4 రోజులు కూడా వర్షాలు పడే అవకాశం ఉన్నందున గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ వంటి కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండి గట్టి నియంత్రణ చర్యలు ముందస్తుగానే చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండి పాముకాటు మందులు ఇతర కావలసిన మందులు అన్ని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మంచినీటి జలాశయాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, మంచినీటి పరీక్షలు తరచూ చేస్తూ ఉండాలని మంచినీటి గొట్టాలు లీకేజీ లేకుండా తనిఖీ చేయాలని సూచించారు. గ్రామాలు, వార్డుల్లో పారిశుధ్యం సజావుగా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. ఎక్కడా నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందకుండా గట్టి నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాల వద్ద మంచినీటి నమూనాలను ఎప్పటికప్పుడు పరీక్షించాలన్నారు. వీధి వ్యాపారులను 80 శాతం గుర్తించారని మిగిలిన వారిని కూడా గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాలు వేగవంతం కావాలని, పైకప్పు స్థాయి లో ఉన్న గృహాలు నుండి రూఫ్ క్యాస్టింగ్ వరకు రూఫ్ క్యాస్టింగ్ లో ఉన్న గృహాలు వచ్చే ఆగస్టు నెల 15వ తేదీ లోగా పూర్తయ్యేలా ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలన్నారు. ఆగస్టు మాసంలో గృహప్రవేశాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతి సాధించేందుకు ఇన్చార్జి అధికారిగా విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజును నియమించామన్నారు. వారు ప్రతిరోజు గృహ నిర్మాణం పై సమీక్షిస్తారన్నారు. పురోగతి సాధించని ఇంజనీరింగ్ అసిస్టెంట్ లపై తగిన చర్యలు తీసుకొనుటకు ప్రతిపాదనలు పంపాలన్నారు. నిధులు మంజూరు చేసిన ఇల్లు కట్టుకోకపోతే సంబంధిత లబ్ధిదారుల నుండి వారికి మంజూరు చేసిన పైకాన్ని ఆర్ ఆర్ చట్టం ప్రకారం తిరిగి వసూలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తల్లికి వందనం పై ఏదైనా సమస్యలు ఫిర్యాదులు అందజేసి ఉంటే వాటిని సత్వరమే పరిష్కరించాలన్నారు తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు, జెడ్పి డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకటరావు ఆర్డబ్ల్యూఎస్ ఈఈ నటరాజు, సిపిఓ భీమరాజు ఎన్ ఐ సి ఏడిఐఓ సెలీనా మినీ కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొనగా ఆన్లైన్లో డిఆర్డిఏ, మెప్మా పీడీలు హరిహరనాథ్, సాయిబాబు, మచిలీపట్నం గుడివాడ ఆర్డిఓ లు స్వాతి బాలసుబ్రమణ్యం, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, డి ఎల్ డి ఓ లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, పాల్గొన్నారు.

# ఏఐ ఆధారిత పురుష సంతానోత్పత్తి పరీక్షను ప్రారంభించిన ఫెర్టీ9

**ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మొట్టమొదటిసారిగా, ప్రత్యేకమైన లెన్సూక్ ఎక్స్12 ప్రో ఆవిష్కరణ**



**విజయవాడ, జూలై 25, మేజర్ న్యూస్ :** ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఫెర్టీ 9 ఫెర్టిలిటీ సెంటర్ విజయవాడ జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో, అత్యాధునిక ఏఐ ఆధారిత సెమెన్ ఎనలైజర్, లెన్సూక్ ఎక్స్12 ప్రో ను పరిచయం చేస్తూ, సంస్థ సంతానోత్పత్తి సంరక్షణ రంగంలో తన నూతన దిశను ప్రకటించింది. ఈ ఆవిష్కరణతో, సంస్థ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని తన అన్ని కేంద్రాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేసిన తొలి ఐవిఎఫ్ చెయిన్‌గా నిలిచింది. ఇది ఖచ్చితమైన రోగనిర్ధారణ, సమగ్ర పునరుత్పత్తి సంరక్షణ పట్ల దాని నిబద్ధతను బలోపేతం చేస్తుంది. ఫెర్టీ9 సహాయంతో గర్భధారణకు చేరుకొని విజయవంతంగా బిడ్డలను పొందిన జంటలు ఈ వేడుకలో పాల్గొని, తమ ప్రయాణాలను పంచుకుంటూ, ఆశను పునరుజ్జీవింపజేసే తమ స్వంత కథలను అందించారు. "ఎటుగెదర్ ఇన్ ఐవిఎఫ్" ప్రచారానికి ప్రాతినిధ్యంగా నిలిచిన ప్రతీకాత్మక కేక్ కటింగ్ వేడుక, సంఘీభావాన్ని, సమిష్టి ఆశయాన్ని చాటి చెప్పింది. భారతదేశంలో మొత్తం సంతానోత్పత్తి రేటు జనాభా స్థిరత్వాన్ని కొనసాగించేందుకు అవసరమైన స్థాయి అయిన 2.1 కంటే తక్కువగా 1.9కి తగ్గిన నేపథ్యంలో, ఈ పరిణామం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ సంఖ్యలు తక్కువగా ఉండి, వరుసగా 1.7, 1.8కి చేరాయి. ఈ స్థితిలో, సమగ్ర, సమానమైన సంతానోత్పత్తి సంరక్షణ అవసరం మరింత కీలకంగా మారింది– ముఖ్యంగా పురుషుల వంధ్యత్వం వంటి కీలక అంశాలను గుర్తించి, వాటిపై సమగ్రంగా స్పందించే అత్యవసరత ఇప్పుడు ఎప్పటికన్నా ఎక్కువగా ఉంది."డిఎన్ఏ ఫ్రాగ్మెంటేషన్ ఇండెక్స్ స్థాయి ఎక్కువగా ఉన్నప్పుడు, గర్భస్రావం రేట్లు 20–25 శాతానికి పెరిగే ప్రమాదం ఉంది, అంతేకాకుండా దీనితో పాటు తక్కువ జనన బరువు, ముందస్తు పుట్టుకల అవకాశాలు కూడా పెరుగుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు," అని డాక్టర్ సుమ, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, ఫెర్టీ9 తెలిపారు. "ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా, మనం నిమిషాల వ్యవధిలోనే వేలాది వీర్యకణాలను విశ్లేషించగలుగుతాము. డిఎన్ఏ సమగ్రతను ఖచ్చితంగా అంచనా వేసి, మరింత సమాచార ఆధారిత చికిత్సా ఎంపికలు చేయడం సులభమవుతుంది. దీని ద్వారా అధిక నాణ్యత గల వీర్యాన్ని గుర్తించడానికి, పిండం అభివృద్ధిని మెరుగుపరచడానికి, సంతానోత్పత్తి చికిత్సల విజయశాతం పెంచడానికి మాకు గణనీయమైన తోడ్పాటు లభిస్తుంది," అని ఆమె వివరించారు. పురుషుల వంధ్యత్వానికి కీలకమైన అంశంగా స్పెర్మ్ నాణ్యత నిలుస్తున్నప్పటికీ, సాంప్రదాయ పరీక్షలు తరచుగా అంతర్గతంగా ఉన్న డిఎన్ఏ నష్టాన్ని గుర్తించలేవు. సూక్ష్మదర్శినిలో సాధారణంగా ఆరోగ్యంగా కనిపించే స్పెర్మ్ కూడా విచ్ఛిన్నమైన డిఎన్ఏను కలిగి ఉండే అవకాశముంది, ఇది ఫలదీకరణం, పిండం అభివృద్ధి, గర్భధారణ విజయాన్ని ప్రభావితం చేయగలదు. మాన్యువల్ టెస్టింగ్ పద్ధతులు కూడా మానవ లోపాలు, పరిమిత సామర్థ్యాల వంటి అవరోధాలకు గురవుతాయి. ఫెర్టీ9 లెన్సూక్ ఎక్స్12 పిఆర్ఓను స్వీకరించడం ఈ క్లిష్టమైన రోగనిర్ధారణ అంతరాన్ని తగ్గిస్తుంది. ఈ విప్లవాత్మక ప్లాట్‌ఫామ్ కేవలం ఆరు నిమిషాల్లో ప్రతి నమూనాలో 3,000 వీర్య కణాలను విశ్లేషించగలదు. గణన, చలనశీలత, ఆకృతి, డిఎన్ఏ సమగ్రతపై ఖచ్చితమైన వివరాలు అందిస్తూ, సింగిల్, డబుల్-స్ట్రాండ్ డిఎన్ఏ విచ్ఛిన్నాలను గుర్తించే సామర్థ్యంతో, పిండశాస్త్రవేత్తలు అత్యుత్తమ వీర్యాన్ని ఎంపిక చేయగలుగుతారు. ఇది ఐవిఎఫ్ వైఫల్యాలను తగ్గించడంలో, గర్భధారణ విజయాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. "సంతానోత్పత్తి సమస్యలలో మగవారి వంతు సగానికి అనగా 50% సమానం కాగా, తొలి సంప్రదింపులలో 95 శాతం వరకు మహిళలచే ప్రారంభమవుతున్నాయి," అని డాక్టర్ జ్యోతి, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, ఫెర్టీ9. ఈ అసమతుల్యతకు ఇప్పుడు మార్పు అవసరం. మేము ప్రవేశపెట్టిన అత్యాధునిక రోగనిర్ధారణ వ్యవస్థతో, మేము సంతానోత్పత్తి సంరక్షణను మరింత సమగ్రంగా, డేటా ఆధారితంగా పునర్నిర్మాణం చేస్తున్నాము. ఇటువంటి సాంకేతికతలు అనవసరమైన చికిత్సలను తగ్గించడమే కాక, భావోద్వేగ, ఆర్థిక ఒత్తిడిని కూడా తగ్గించగలవు, తద్వారా దాని వెనుక ఉన్న శాస్త్రీయ ఆధారాలతో దంపతులకు నిజమైన ఆశను అందించగలవు. ఎటుగెదర్‌ఇన్‌ఐవిఎఫ్ ప్రచారానికి అనుగుణంగా, ఫెర్టీ9 పరిమిత కాలం కోసం జంటలకు ప్రత్యేక సంతానోత్పత్తి అంచనా ప్యాకేజీని కేవలం ?599 వద్ద అందిస్తోంది. ఇందులో సంతానోత్పత్తి సూపర్ స్పెషలిస్ట్‌తో సంప్రదింపులు, అల్ట్రాసౌండ్, ఎఎంహెచ్ టెస్ట్, వీర్య పరీక్షలు చేర్చబడ్డాయి. అలాగే, జూలై 31, 2025 లోపల చికిత్స ప్రారంభించిన జంటలకు, ఐయుఐ చికిత్సపై 50%, ఐవిఎఫ్ పై 25% రాయితీ కూడా లభిస్తుంది. ఈ ప్రారంభంతో, ఫెర్టీ9 సంతానోత్పత్తి సంరక్షణ రంగంలో తన నాయకత్వ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తోంది. సానుభూతి, ఖచ్చితత్వం, ఏఐ ఆధారిత పరిజ్ఞానం యొక్క సమన్వయంతో, మెరుగైన ఫలితాలను అందించడం పట్ల సంస్థ దృఢంగా కట్టుబడి ఉంది.

## ఆర్యవైశ్య విద్యార్థినికి ఆర్థిక సాయం



**నందిగామ, జులై 25, మేజర్ న్యూస్:** విద్యార్థిని విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలని నందిగామ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి పారేపల్లి సాయిబాబు అన్నారు. కంచికచర్ల మండలం కీసర గ్రామానికి చెందిన నిరుపేద ఆర్యవైశ్య కుటుంబమునకు చెందిన పసుమర్తి మురళి– ప్రసన్న ల కుమార్తె కారుణ్య నందిగామలోని తేజ డివిఆర్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతుంది. ఆర్థిక పరిస్థితి సరిగా లేని కారణంగా అమ్మాయి తల్లిదండ్రులు మొదటి సంవత్సరం ఫీజు విషయమై పారేపల్లి సాయిబాబు ను సహకారం అందించాలని కోరగా వెంటనే ఉద్యోగరీత్యా అమెరికాలో ఉంటున్న మహంకాళి విజయకుమార్ సునీత దంపతులు తాము సభ్యులుగా ఉన్న అతి పెద్ద ఫౌండేషన్ "ఆశాజ్యోతి ఫౌండేషన్" ద్వారా ఈరోజు స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కారుణ్యకు సంవత్సరం ఫీజు 12,000 రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ విద్యార్థిని బాగా చదువుకొని మంచి మార్కులు తెచ్చుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రోత్సహించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు,కార్యదర్శి,కోశాధిరి చవట నాగేశ్వరరావు, వనమా నరసింహారావు,మారం వెంకట సత్యనారాయణ, నాలుగో వార్డ్ మున్సిపల్ కౌన్సిలర్ మారం అమరయ్య,ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు చల్లా గాంధీ, దుద్దు నాగేశ్వరరావు,కొత్తూరు రవి పబ్బతి జనార్ధనరావు,కేతేపల్లి సత్యం బాబు,మిట్టపల్లి మురళీ, కేతేపల్లి వాసు, చిత్రపు నాగేశ్వరావు,ఉప్పల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కాంప్లెక్స్‌లలో దివ్యాంగులకు అవకాశం కల్పించాలి



**జగ్గయ్యపేట జులై 25 మేజర్ న్యూస్ :** పట్టణ పరిధిలో ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ లలో ఉన్న షాపులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం దివ్యాంగులకు 5% అవకాశం కల్పించాలని నియోజకవర్గ దివ్యాంగుల అధ్యక్షుడు వడ్డేపూడి ఉమామహేశ్వరరావు కోరారు. శుక్రవారం ఆయన మున్సిపల్ కమిషనర్కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 150 షాపులు కలిగి ఉన్నాయని అందులో ప్రభుత్వం నిబంధన ప్రకారం దివ్యాంగులకు 5% అవకాశం కల్పిస్తే ఎనిమిది మందికి ఉపాధి అవకాశం కలుగుతుందని కనుక అధికారులు తప్పకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం దివ్యాంగులకు షాపులను కేటాయించినట్లయితే వారు ఆర్థికంగా ఎదుగుదలకు తోడ్పాటును అందించే వారము అవుతామని తప్పకుండా మున్సిపల్ కమిషనర్ తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ఆటోను ఢీకొన్న లారీ.. నలుగురికి గాయాలు...



**నందిగామ, జూలై 25, మేజర్ న్యూస్:** మండలంలోని అడవిరావుల పాడులో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు అడవి రావులపాడు నుంచి నందిగామ వైపు వెళుతున్న ఆటోను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శామ్‌సంగ్‌తో కలిసి రేపటి భారతదేశాన్ని సరికొత్తగా ఆవిష్కరిస్తున్న బెంగళూరు విద్యార్థులు



**విజయవాడ మేజర్ న్యూస్ :** శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో, 14-22 ఏళ్ల యువ మేధావులకు ఒక జాతీయ ఆవిష్కరణ సవాలు ద్వారా, బెంగళూరులోని క్యాంపస్‌లు భవిష్యత్తు మార్పు కోసం లాంచ్ ప్యాడ్ లుగా మారుతున్నాయి. ఏప్రిల్ 29న ప్రారంభమైన తాజా సీజన్, డిజైన్ థింకింగ్ వర్క్ షాపులు, ఓపెన్ హౌస్ల ద్వారా దేశ వ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోంది. ఈ కార్యక్రమం ప్రధాన మెట్రోలకే కాకుండా ఈశాన్య భారతదేశంలోని చురుకైన విద్యా కేంద్రాల వరకూ చేరింది. ఈ సంవత్సరం, కార్యక్రమం మొదటి అత్యుత్తమ నాలుగు జట్లకు కోటి రూపాయల నజరానాతో పాటు ప్రోటోటైప్ అభివృద్ధికి అవసరమైన అన్ని మద్దతులను అందిస్తోంది. ఇందులో శామ్‌సంగ్ నాయకులు, ఐఐటి ఢిల్లీ ప్రొఫెసర్లు వంటి నిపుణుల నుంచి దిశానిర్దేశం, అలాగే కీలక పెట్టుబడిదారులతో అనుసంధాన అవకాశాలు కూడా ఉన్నాయి. తద్వారా యువ ఆవిష్కర్తలు తమ ఆలోచనలను వాస్తవ రూపంలోకి మార్చుకునే అవకాశాన్ని పొందుతున్నారు. బెంగళూరులో, ఈ నెలలో ఐదు ప్రముఖ పాఠశాలలు, కళాశాలల నుండి 3,000 మందికి పైగా విద్యార్థులు పెద్ద కలలు కనేందుకు, ధైర్యంగా ఆలోచించేందుకు, దేశ భవిష్యత్తును రూపొందించే పరిష్కారాలను సృష్టించేందుకు ఒక వేదిక పైకి వచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన రోడ్ షోలు, ఓపెన్ హౌజ్‌ల సమయంలో, తరగతి గదులు ఆవిష్కరణలతో ఉత్పిపడే ఆలోచనలు, చర్చలు, ప్రేరణతో సందడిగా మారాయి.

## యూజీ 2,4వ సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల చేసిన ఆచార్య కూన రాంజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణా యూనివర్సిటీ పరిధిలో 2020– 25 విద్య సంవత్సరపు యూజీ రెండవ నాల్గవ సంవత్సరం సెమిస్టర్ పరీక్షల పునః మూల్యాంకనం ఫలితాలను కృష్ణా యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య కూన రాంజీ శుక్రవారం విడుదల చేసినట్లు పరీక్షా నియంత్రణ అధికారి వీరా బ్రహ్మచారి ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ పరీక్షల్లో 3952 మంది విద్యార్థి విద్యార్థులు పునః మూల్యాంకనం కు దరఖాస్తు చేసుకొనగా 817 మంది విద్యార్థి,విద్యార్థులు ఉత్తీర్ణతలయ్యారు. ఈ సమావేశంలో కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎన్ ఉషా తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సహకారంతో శ్రీనివాసరావుకు ఆర్థిక సాయం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో 26 డివిజన్‌కు చెందిన ఎన్నేటి శ్రీనివాసరావుకు మంత్రి కొల్లు రవీంద్ర సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ 55,546 రూపాయలు ఆర్థిక సహాయం శ్రీనివాసరావు, వారి కుటుంబ సభ్యులకు కూటమి నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపిఅధ్యక్షులు చెరుకూరి సూరిబాబు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్ మౌలాలి మాజీ హాస్పిటల్ డైరెక్టర్అజీమ్ బూత్ ఇన్చార్జిలు వన్నెంరెడ్డి ప్రసాద్,షేక్ భాష మైనార్టీ టిడిపి నాయకులు ఆసిఫ్ భాష షేక్ నాగూర్ బాబు మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** మండలంలోని కృష్ణారావు పాలెం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదవ తరగతి ఇంటర్మీడియట్‌లలో చేరటానికి ఖాళీగా ఉన్న సీట్ల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె సిద్ధయ్య శుక్రవారం తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఐదవ తరగతిలో ప్రవేశానికి 2025, 26 విద్యా సంవత్సరమునకు మిగులు సీట్లు భర్తీ కొరకు పాఠశాల, కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.



## ఏడాది పాలనలో ప్రజల్లో సంతృప్తి

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** రాష్ట్రాన్ని వైకాపా అప్పుల ఊబిలోకి నెడితే కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్దే లక్ష్యంగా పనిచేస్తోందని తెలుగుదేశం నేతలు పేర్కొన్నారు. మండల పరిధిలోని మేడిలంకలో శుక్రవారం సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నేతలు మాట్లాడుతూ గత ఏడాది కాలంగా రాష్ట్ర ప్రభుత్వ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్ర జల ఆదరాభిమానాలను చూరగొందన్నారు. గత వైకాపా పాలనలో విధ్వం సానికి గురైన రాష్ట్రాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టిందన్నారు. ఇంటింటికీ తిరిగి ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, కర్రా సుధాకర్, బండే రాఘవ, పర్చూరి దుర్గాప్ర సాద్,మండలి రామ్మోహన్ రావు, మెగావత్తు గోపి, బట్టు నరసింహారావు, కమ్మిలి సుబ్రమణ్యం, గరికిపాటి కృష్ణారావు, గోశాల బాలకోటయ్య, బచ్చు రాఘవయ్య, మెరుగు సోమిరెడ్డి,పెనుమాక రాజు, పెనుమాక ప్రసాద్, నాగార్జున, కోటేశ్వరరావు, సత్యనారాయణ, పీత వెంకటేశ్వరరావు మోపిదేవి నారాయణ, కారుమూరి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఎఎన్ఎమ్ అండ్ వివిఆర్ఎస్ఆర్ స్కూల్లో "ఎల్లో డే"



**గుడ్లవల్లేరు జూలై 25 మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు ఎఎన్ఎమ్ అండ్ వివిఆర్ఎస్ఆర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో తొలి శ్రావణ శుక్రవారం సందర్భంగా "ఎల్లో డే " పసుపురంగు దినోత్సవంను ఎల్ కె జి, యు. కె. జి చిన్నారులు జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ ఇ. సి. ఇ శాఖ సీనియర్ లెక్చరర్ ఎవిఎన్ఎల్ సరోజిని పాల్గొని చిన్నారులతో ముచ్చటిస్తూ మానవ జీవనంలో, ప్రకృతి లో పసుపు రంగు ప్రాధాన్యత, ప్రయోజనాలు గురించి చిన్నారులకు వివరించారు. విద్యార్థులు పసుపు రంగు దుస్తులు ధరించి, అవే రంగు పుష్పాలు, కూరగాయలు, పండ్లు సేక రించి ప్రదర్శించారు. వాటి రూపాలను విచిత్ర వేష దారణలతో వివరిం చారు. పసుపు రంగుకు సంబంధించిన రైమ్స్ నృత్య రూపకంగా ప్రదర్శిం చారు. ఈ కార్యక్రమంలో కె. జి. చిన్నారుల తల్లిదండ్రులు, స్కూల్ వైస్ ప్రెసిడెంట్ కొడాలి వెంకట కృష్ణారావు, డైరెక్టర్ నారాయణం శ్రీనివాస మూర్తి, ప్రిన్సిపాల్ కుంజుమన్, వైస్ ప్రిన్సిపాల్ సత్యంబాబు, టీచర్స్ శ్రీలత, శ్రీలక్ష్మి, శ్యామల, మాధవి లు పాల్గొన్నారు.

## శ్రీకొండలమ్మ గుడిలో శ్రావణ మాసోత్సవాల ప్రారంభం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** మండలం, వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం శ్రావణ మాసం ఆరంభము, శుక్రవారం సందర్భంగా అమ్మవార్లకు విశేష పూజలు జరిగినవి. ఈవో ఆకుల కొండలరావు దంప తులు ప్రత్యేక పూజలో పీటల పై కూర్చొని పూజలు నిర్వహించారు. అర్చ కులు రుద్రపాక శివ సంతోష్ శర్మ ఈ ప్రత్యేక పూజలను వేద మంత్రోచ్ఛా రణలతో నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని ద ర్శించుకొని తరించారు. అత్యధిక స్థాయిలో భక్తులు శ్రీ అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి, వారి యొక్క మొక్కుబడులు తీర్చుకొన్నారు. సా. 5.30ని.ల నుండి సాయంకలార్చన అనంతరము పంచహారతులు, నక్షత్ర హారతి, నాగ హారతి, సింహ హారతి, కుంభ హారతి, కర్పూర హారతి అనం తరం నీరాజన మంత్ర పుష్పములు జరిగినవి. ఏర్పాట్లు పర్యవేక్షించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపినారు.



# సింగలూరు చెరువుకు స్వచ్ఛమైన తాగునీరు సమకూరేనా?





### జిల్లా కలెక్టరుకు విన్నవించినా పరిష్కారం రాలేదు

### చెరువు, మంచినీటి పరిరక్షణకు గ్రామస్తుల ఆందోళన

### రాష్ట్ర రాజధానికి చేరనున్న సింగలూరు నీటి సమస్య

**గుడ్లవల్లేరు జూలై 19 మేజర్ న్యూస్ :** మండలంలోని చంద్రాల శివారు సింగలూరు గ్రామ మంచినీటి చెరువు పరిరక్షణకు, స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కొరకు గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే 70 సంవత్సరాల నుండి మంచినీటి చెరువుకు నీటిని నింపే ప్రైవేటు బోదెపై రైతు అభ్యంతరం చెప్పారు. దీంతో సింగలూరు గ్రామస్తులు తహశీల్దార్, ఎంపిడిఓ, జిల్లా కలెక్టర్ లకు మంచినీటి సమస్యపై వినతిపత్రాలు సమర్పిం చారు. రైతు ససేమిరా అనడంతో మంచినీటి పరిరక్షణ చర్యల్లో చెరువు భూమిని సర్వే చేయాలని గ్రామస్తులు కోరారు. పంచాయతీ కార్యదర్శి రాజేష్ సమక్షంలో రెవెన్యూ, సర్వే అధికారులు సర్వేచేసి చెరువుకు హద్దులు నిర్ణయించారు. గ్రామస్తులు, సర్పంచ్ కలిశెట్టి అర్జునరావు కలసి చెరువు హద్దుల్లో బోర్లువేసి కాంక్రీటు పిల్లర్స్ నిర్మాణం చేసారు. గ్రామస్తుల వినతిపై జిల్లా కలక్టరు బాలాజీ సింగలూరు మంచినీటి సమస్యపై ఆరా తీయడంతో ఎంపిడిఓ ఇమ్రాన్, డిప్యూటీ ఎంపిడిఓ నరసింహారావులు సింగలూరు విచ్చేసి చెరువును పరిశీలించి నీటిసమస్య, సర్వే హద్దులు, పిల్లర్ల ఏర్పాటు పరిస్థితిని జిల్లా కలక్టరుకు వివరించినట్లు తెలిసింది.

కొత్తగా పంచాయ తీవారు చెరువుకు నీటిని సరఫరా చేస్తున్న వేరే బోదెలో ప్రక్కనున్న పంటచేల నుండి వచ్చే మురుగు నీరు, పంటలకు పిచికారీచేసిన రసాయనిక అవశేషా లు కలుస్తుండడంతో చెరువు మంచినీరు కలుషితం కాకుండా చూడాలని, మంచినీటి చెరువును పరిరక్షించటానికి ఫెన్సింగ్ వేయాలని చంద్రాల నూతన కార్యదర్శి రాజేంద్రకు గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. సింగలూరు మంచినీటి చెరువు పరిరక్షణ, స్వచ్ఛమైన త్రాగునీటి సమస్య మూడు నెలలైనా పరిష్కారం లభించకపోవడంతో ఆందోళనతో గ్రామమంతా మహిళలు, పిల్లలతో సహా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌ను కలసి విన్నవించనున్నట్లు తెలుస్తోంది.

# బాబు షూరిటీ - మోసం గ్యారంటీ నందిగామ విస్తృతస్థాయి సమావేశం





**నందిగామ, జూలై 25, మేజర్ న్యూస్ :** పట్టణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో నందిగామ మాజీశాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు సమావేశమయ్యా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకు అమ లు సాధ్యంకానీ హామీలివటం అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించటం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నెతో పెట్టిన విద్యని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరాలను ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించాలన్నారు. ముఖ్యంగా మండలం లోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం మోసా లను అర్థమయ్యేలా వివరించాలని తెలిపారు.ఎన్నికలకు ముందు కూటమి పా ర్టీలు ఇచ్చిన హామీలను నమ్మి ప్రజల పూర్తిగా మోసపోయారని జగన్మోహన్ రావు తెలిపారు ఏడాది కాలంగా ప్రజలకు చేసిందేమీ లేకపోయినా సుపరిపా లన - తొలి అడుగు అంటూ ప్రజలను మరోసారి ఏ మార్చే యత్నం చేస్తున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు.సూపర్ సిక్స్ పథకాలను అదిగో చేస్తున్న ఇదిగో ఇస్తున్నామంటూ అసత్య ప్రచారాలు చేయటం తప్ప ఒక పథకాన్ని కూడా స మర్థవంతంగా అందించిన దాఖలాలు లేవని చెప్పారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తే కూటమి ప్రభుత్వం మాత్రం ఇచ్చే అరకొర పథ కాలను షారుతులు విధించి అనర్హులంటూ లబ్దిదారులను కుదిస్తుందని తెలి పారు. వారి మోసాలను ప్రజలు గమనిస్తున్నారని రానున్న కాలంలో బుద్ధి చె ప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, జడ్పీ టీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వచ్ఛందంగా గుంతలు పూడ్చిన యాసం యూత్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రమాదాలకు నెలువుగా మారిన ప్రధాన రహదారిపై గుంతలను స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు యూత్ ఆధ్వర్యంలో గుంటలను పూడ్చి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఇటీవల మీడియాలో వచ్చిన కథనాలకు స్పందించి అవనిగడ్డ - నాగాయలంక ప్రధాన రహదారిలో డంపింగ్ యాడ్ సమీపంలో రెండు ప్రమాదాలకు కారణమైన రెండు గుంటలను శుక్రవారం పూడ్చారు. ఈ గుంటలలో 15 రోజులు వ్యవధిలో ఒకరు మృతిచెందగా మరొకరు గాయపడి విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు 20 రోజుల క్రితం బందలాయి చెరువుకు చెందిన కొండవీటి శేషబాబు బైక్ గుంటలో పడడంతో ఎగిరి పడిపోయి వారం రోజుల పాటు చికిత్స పొందుతూ మరణించాడు ఈనెల 21వ తేదీ సోమవారం ఉదయం అవనిగడ్డ నాలుగో వార్డ్ కు చెందిన రేపల్లె వేణు తీవ్ర గాయాలపాలు అవడంతో విజయవాడ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు 15 రోజుల వ్యవధిలో ఒకే ప్రాంతంలో ఇరువురికి గాయాలు అవ్వడంతో స్పందించిన యాసం చిట్టిబాబు వంద మీటర్ల వ్యవధిలో ఉన్న మూడు గోతులకు మరమత్తులు చేయించి ఆదర్శంగా నిలిచారు దీనితో చిట్టిబాబుకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, కృష్ణ జిల్లా ఎస్సీ సెల్ మాచవరపు ఆదినారాయణ, అడపా వెంకటేశ్వరరావు, యలవర్తి చిన్న,మొగల్ మురాద్ బేగ్, లింగం బాబురావు, పీరాటి రాంబాబు, అది విజయ్, అడపా నాగరాజు,మల్లిశెట్టి సత్యనారాయణ, తుంగల సుధా తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల అభివృద్ధి కూటమి ధ్యేయం

### పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

**బంటుమిల్లి మేజర్ న్యూస్ :** గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వం ధ్యేయమని పెడన నియోజవర్గం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. మండలంలో మల్లేశ్వరం గ్రామంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మల్లేశ్వరం గ్రామంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఇంటింటికి సందర్శించి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరప్రత్రాలు అందించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వర సర్పంచ్ చెన్ను శ్రీనివాసరావు, బంటుమిల్లి డి.సి.చైర్మన్ బొర్రా కాశీ విశ్వేశ్వరరావు, జొన్నలగడ్డ కొండలరావు. ఇల్లూరి లీలాకృష్ణ, కందుల. నాగేశ్వరరావు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రారంభమైన శ్రావణమాస శోభ

**మొవ్వ మేజర్ న్యూస్ :** శ్రావణమాసం శుక్రవారంతో ప్రారంభం కావడంతో మండలంలోని ఆయా గ్రామాల్లో గల దేవాలయాలు మహిళలతో కళకళలాడడం శ్రావణమాస మొదటి శుక్రవారం కావడం శ్రావణ శోభ సంతరించుకుంది. కూచిపూడి, మొవ్వ, మొవ్వపాలెం, గూడపాడు, పెదపూడి, నిడుమోలు, కోసూరు, కాజా, చిన్నముత్తేవి, అయ్యంకి, గ్రామాల్లో గల శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు శ్రావణ లక్ష్మి అవతారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, లలితా పారాయణ పఠనం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు ఆలయ అర్చకులు అందించారు.

## చినముత్తేవి పిఎసిఎస్ అధ్యక్షులుగా కొసరాజు



**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని చినముత్తేవి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులుగా కొసరాజు.ప్రకాష్ మాధుర్ (పెదముత్తేవి) శుక్రవారం బాధ్యతలు నిర్వహించారు. చినముత్తేవి ప్రధాన కేంద్రంగా ఉన్న ఈ సహకార పరపతి సంఘంలో పెదముత్తేవి, కొండవరం గ్రామాలకు సంబంధించిన రైతాంగానికి రుణ సౌకర్యం కల్పిస్తూ ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సహకార సంఘాలకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. అందులో భాగంగా పెదముత్తేవి గ్రామానికి చెందిన కొసరాజు. ప్రకాష్ మాధుర్ అధ్యక్షులుగాను, పాలకవర్గ సభ్యులుగా మురారి శివ నాగరాజు (కొండవరం) సుంకర. వెంకటేశ్వరరావు (చినముత్తేవి) లను నియమించింది. దీంతో ముగ్గురు సభ్యుల పాలకవర్గం బాధ్యతలు స్వీకరించింది. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వర రావు, వీరంకి తులసీదాస్, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి మోడరన్ పెంటాతలన్ పోటీలకు ఏకత్వా విద్యార్థులు



**నందిగామ, జులై 25, మేజర్ న్యూస్:** వీరులపాడు మండలంలోని పొన్నవరం ఏకత్వా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు 13మంది రాష్ట్రస్థాయి మోడ్రన్ పెంటాతలన్ పోటీలకు ఎంపికవటం ఎంతో గర్వకారణంగా ఉందని పాఠశాల ఫౌండర్, డైరెక్టర్ డాక్టర్ అమరనేని మనోజ్ అన్నారు. వీరు 24వ తేదీన ఈడుపుగల్లులోని ప్రభుత్వ స్విమ్మింగ్ ఫూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి మోడరన్ పెంటాదలేన్ ఎంపికలలో స్విమ్మింగ్, రన్నింగ్, ఫెన్సింగ్ వంటి క్రీడాంశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని. ఈ విద్యార్థులు జులై 26, 27 తేదీలలో విజయవాడలోని బ్లూమింగ్ హేల్ అంతర్జాతీయ పాఠశాలలో జరగబోయే తొమ్మిదవ అంతర జిల్లాల మోడరన్ పెంటాతలేన్ పోటీలలో కృష్ణాజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ మోడరన్ పెంటాతలన్ ఎంతో సత్తువ, ఓర్పు కలిగిన క్రీడాంశాలతో కూడి ఉంటుందని ఇటువంటి విభిన్నమైన క్రీడను తమ పాఠశాలలో ప్రవేశపెట్టి ఎక్కువమంది విద్యార్థిని, విద్యార్థులను ప్రోత్సహిస్తున్న వ్యాయామ విద్య విభాగాధిపతి విజయ్ కుమార్ గోగులమూడిని ఆయన ఎంతగానో ప్రశంసించారు.

## సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

**విజయవాడ, జులై 25, మేజర్ న్యూస్ :** బంగాళాఖాతంలో అల్ప పీడనం ప్రభావంతో విస్తారంగా కురుసున్న వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉన్నామని, నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 0866 2574 454 నంబరుతో 24 గంటలూ పనిచేసే విజయవాడలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. డివిజన్ లో వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ఈ ఫోన్ నెంబర్ కి కాల్ చేసి సమాచారం అందించాలని ఆర్డీవో చైతన్య కోరారు.

# సంక్షేమం అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం




**నందిగామ, జులై 7, మేజర్ న్యూస్:** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశానుసారం, సుపరిపాలనలో తొలి అడుగు ఇంటి ఇంటికి కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య పిలుపుమేరకు చందర్లపాడు మండలం ఏటూరు గ్రామంలో పార్టీ నాయకులు కార్యకర్తలు తో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు ఉన్నం నరసింహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ నాయకులతో కలిసి ఉన్నం నరసింహారావు ప్రజలతో మమేకమై, తెలుగుదేశం పార్టీ ప్రజల సంక్షేమం కోసం, ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. "సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు, పాలనలో జవాబుదారీతనం, పారదర్శకతను నిర్ధారించడమే కూటమి లక్ష్యం," అని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలపై ప్రతి ఇంటిలోకి వెళ్లి గడపగడపకూ చంద్రబాబు నాయుడు సంకల్పాన్ని చాటి చెప్పారు. గత ఐదేళ్లలో వైసీపీ హయాంలో జరిగిన నష్టంతో పాటు ఏడాది కాలంలోనూ ప్రజలుమెచ్చిన పాలన అందించామని గణాంకాలతో వివరించారు. అత్యధిక కుటుంబాలకు మేలు చేకూర్చేలా తల్లికి వందనం కింద గతంలో ఒక్కరికే రూ.15 వేలు చెల్లిస్తే, ఇప్పుడు ఇద్దరికి మించి పిల్లలున్న వారందరికి రూ.30 నుంచి 60వేల వరకు తల్లి ఖాతాలో జమ చేసిన విషయానికి గడపగడపకు వెళ్లి వివరించారు. పేదల కోసం అన్నక్యాంటీన్లను ప్రారంభించడం, ఆగస్టు నుంచి మహిళలందరికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## మోపిదేవి ఖ్యాతి పెరిగేలా పని చేయాలి : బుద్ధ ప్రసాద్



**మోపిదేవి మేజర్ న్యూస్ :** మోపిదేవి గ్రామ సచివాలయాని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ప్రారంభించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ఎదుట ట్రాఫిక్ తగ్గాలని, భక్తుల కోసం టాయిలెట్స్, కాంప్లెక్స్ వసతి గదులు నిర్మిస్తామని మోపిదేవి ఖ్యాతి పెరిగేలా చూస్తానని ఎమ్మెల్యే అన్నారు. మోపిదేవికి మరో ప్రధాన రహదారి అవశ్యమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం మోపిదేవిలో ఉపాధి హామీ నిధులు రూ.43.60 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా దినదినాభివృద్ధి చెందుతున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ఎదుట భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు మరో రోడ్డు నిర్మించాల్సి ఉందన్నారు. దీంతో పాటు భక్తుల కోసం టాయిలెట్స్ కాంప్లెక్స్, వసతి గదులు నిర్మిస్తామన్నారు. ఇప్పటికే కోనేరు ఆవరణలో నిర్మిస్తున్న వసతి గదుల సహిత షాపింగ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఇలాంటి కాంప్లెక్సులు మరిన్ని నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

## ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వ మోసాలను వివరించండి : మాజీ ఎమ్మెల్యే కైలే




**పామర్రు జులై 25 మేజర్ న్యూస్ :** నియోజకవర్గ పామర్రు టౌన్ లోని బొమ్మారెడ్డి సీతారెడ్డి కళ్యాణ మండపంలో పామర్రు మండలస్థాయి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, స్థానిక మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కైలే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరూ తెలుగుదేశం, కూటమి ప్రభుత్వ మోసాలను స్కాన్ చేసి ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ అంశం పై నాయకులకు, కార్యకర్తలకు ఆయన అవగాహన కల్పించారు. మండల పార్టీ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ళ,రమాదేవి, పామర్రు గ్రామ సర్పంచ్ కైతావత్తు కస్తూరి, స్థానిక ఎంపీటీసీ సభ్యులు, కృష్ణాజిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు తాడిశెట్టి శ్రీనివాసరావు లతోపాటు పలువురు నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అధిక వర్షాలకు వివిధ పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలంలోని పాత మాజేరు, కొత్త మాజేరు పరిసర ప్రాంతాలలో వరి నారు మడులను, ఎద పద్ధతిలో సాగు చేస్తున్న వరి పొలాలను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం శుక్రవారం పరిశీలించారు. వర్షాలకు నారుమడిలో విత్తనం చల్లిన 2-3 రోజుల వయసులో 3 కన్నా ఎక్కువ రోజులు నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుంది. వీలైనంత త్వరగా నీరు బయటకు తీసి వేయాలి. విత్తిన 7 నుండి 30 రోజుల మధ్యలో నారు 5 కన్నా ఎక్కువ రోజులు మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉంది. మునిగిన నారుమడి లో నుండి నీరు 5 రోజుల లోపు పూర్తిగా బయటకు తీసివేయాలి. తర్వాత 5 సెంటల నారుమడికి 1 కిలో యూరియా o1 కిలో పోటాష్ వేసుకోవాలి. మొక్క నిలదొక్కుకున్న తర్వాత లీటరు నీటికి 1గ్రా కార్బెండజిం లేదా 2 గ్రా కార్బెండజిం o మాంకోజెబ్ కలిసిన మిశ్రమం గానీ పిచికారీ చేసుకోవాలి. పిలకల దశలో సాధారణ రకాలు 5 రోజుల వరకు నీట మునిగినా బతికే అవకాశం ఉంది. పిలకల దశలో వరి పంట మునిగితే నీరు బయటకు తీసిన తరవాత ఎకరానికి 20 కిలోల యూరియాం20 కిలోల పోటాష్ అదనంగా వేసుకోవాలి. ఈ విధంగా బూస్టర్ డోస్ వేసుకోవడం వలన మొక్క ముంపు ప్రభావం నుండి త్వరగా కోలుకుంటుంది. కోలుకున్న తర్వాత కుళ్ళు తెగులు రాకుండా లీటరు నీటికి 1గ్రా కార్బెండజిం లేదా 2 గ్రా కార్బెండజిం o మాంకోజెబ్ కలిసిన మిశ్రమం గానీ పిచికారీ చేసుకోవాలి. పొడ తెగులు వ్యాప్తికి హెక్సాకొనజోల్ 2 మి.లీ లేదా వాలిదామైసిన్ 2 మి.లీ లేదా అజాక్సిస్ట్రోబిన్ 1 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ఈ కార్యక్రమంలో సస్యపోషణ శాస్త్రవేత్త వెంకట లక్ష్మి, సస్యరక్షణ శాస్త్రవేత్త రేవతి, రైతులు పాల్గొన్నారు.

# 27న ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఫ్రీ ఐ మెడికల్ క్యాంప్



**విజయవాడ జులై 25, మేజర్ న్యూస్ :** కేశినేని ఫౌండేషన్, ఫినిక్స్ ఫౌండేషన్ సంయుక్తంగా శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో జూలై 27వ తేదీ ఆదివారం ఎంపీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరం పోస్టర్ ను ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) విడుదల చేశారు. పశ్చిమ నియోజకర్గంలోని గణపతిరావు రోడ్ లోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీ కేశినేని శివనాథ్, నియోజకవర్గ పరిశీలకులు చిట్టాబత్తుని శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, రాష్ట్రమైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా తో కలిసి ఫ్రీ ఐ మెడికల్ క్యాంప్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ పశ్చిమ నియోజకవర్గంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, నియోజవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు సుఖాసీ సరిత, నియోజవకర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ, గొల్లపూడి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాల మాధవ, ఎ.ఎమ్.సి డైరెక్టర్ మైలపల్లి రాజు, డివిజన్ అధ్యక్షులు అమర గోపాల్ కృష్ణ, శ్రీను, సత్యనారాయణ, కుంచం దుర్గారావు, టి.వి. మధు, షేక్ అజీజ్, బొడ్డుపల్లిశ్రీను, పేరం సత్యనారాయణ, కో క్లస్టర్లు పేరబత్తుని రమణ, దాడి మురళీ, క్లస్టర్ ఇన్చార్జ్ రేగళ్ల లక్ష్మణరావు, సుబానీ,బుడుగు గణేష్, వివికె నరసింహారావు, పశ్చిమ 54వ డివిజన్ ప్రధాన కార్యదర్శి సెక్రటరీ వరలక్ష్మీ,, కో క్లస్టర్ షేక్ తమీమ్ అన్సార్, టిడిపి మహిళ నాయకురాలు విజయలక్ష్మీ, పద్మ, నసీమా లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలను తొలగించండి

**విజయవాడ, జూలై 25, మేజర్ న్యూస్ :** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఆటంకంగా ఉన్న బోధనేతర కార్యక్రమాలన్నీ ఉపాధ్యాయులకు తొలగించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్ది బాబూ రాజేంద్ర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు, కార్యదర్శి దోనె అశోక్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని సమస్యలను తెలియజేశారు. ప్లస్ టు పాఠశాలలను పాఠశాల విద్య లోనే కొనసాగించాలని, ప్లస్ టు పాఠశాలలను కో ఎడ్యుకేషన్ విధానం అమలు చేయడం వల్ల ప్రవేశాలు పెరిగే అవకాశం ఉందని తెలియజేశారు. క్లస్టర్ ఉపాధ్యాయులు సబ్జెక్ట్ టీచర్ అవసరం ఉన్న చోట ని.యమించి ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారులకు బదిలీలు నిర్వహించి, ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా బదిలీ కోరుకునే వారికి అవకాశం కల్పించాలని కోరారు.ఒకటవ తరగతి నుండి 10వ తరగతి వరకు నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాలలో అదే క్యాంపస్ లో ఉన్న ఫౌండేషనల్ స్కూల్స్ ఒకటి రెండు తరగతులు అడ్మిషన్ చేసుకొనే వెసులుబాటు కల్పించాలని,హైస్కూల్ మూడో తరగతి నుంచి పదో తరగతి



వరకు నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులకు సమావేశాలను సాయంత్రం మూడు నుండి నాలుగు గంటల వరకు నిర్వహించాలని పాఠశాల పనివేళల తర్వాత సమావేశాలు జరపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

# వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ మహా సంప్రోక్షణ

**ఈ నెల 26 నుంచి ఆరు రోజుల పాటు అష్టబంధన మహా సంప్రోక్షణ, కుంభాభిషేకం : ఆలయ పర్యవేక్షకులు ఎం.మల్లికార్జున**






**విజయవాడ మేజర్ న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో విజయవాడ పున్నమ్మతోటలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 26వ తేదీ నుంచి అష్టబంధన మహా సంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలను ఆగమ శాస్త్ర ప్రకారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని, భక్తులు స్వామి వారి మహా క్రతువులో పాల్గొని తరించాలని ఆలయ పర్యవేక్షకులు ఎం.మల్లికార్జున కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ నుంచి పున్నమ్మతోటలో గల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మహా సంప్రోక్షణ కార్యక్రమాలను ఆలయ పర్యవేక్షణ అధికారి మల్లికార్జునరావు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం హిందూ దేవాలయాలను ప్రతి 12 ఏళ్లకోసారి మహా సంప్రోక్షణ చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో విజయవాడ పున్నమ్మతోటనందు టీటీడీ అధికారులు, స్థానిక భక్తులు, దాతల సహకారంతో 2010లో ఆలయ నిర్మాణాన్ని చేపట్టి 2012లో స్వామివారి విగ్రహ ప్రతిష్టగావించడం జరిగిందన్నారు. విగ్రహ ప్రతిష్ట జరిగి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని అష్ట బంధన మహా సంప్రోక్షణ, కుంభాభిషేకాలను నిర్వహించాలని టీటీడీ ఆగమ సలహాదారు పరాశరం భావనారాయణాచార్యులు నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆరు రోజుల పాటు అత్యంత వైభవంగా శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ మహా సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆరు రోజుల పాటు శోభాయమానంగా నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా నిత్య హోమం, యజ్ఞయాగాలు, అష్టబంధన ద్రవ్యారాధనం, తిరుమంజనం, కళావాహనం, ప్రథమ కాలార్చనం, అక్షతారోహణ, బ్రహ్మ ఘోష, ఆచార్య రుత్విక్ బహుమానం వంటివి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమాలకు భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. అష్టబంధన మహా సంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన ఆగమ శాస్త్ర పండితులు, వేద పండితులు స్వయంగా నిర్వహించేందుకు ఇప్పటికే నగరానికి చేరుకోవడం జరిగిందన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.బాలమురళీకృష్ణ అయ్యంగార్ మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో అష్టబంధన మహా సంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 26న ఉదయం 8.30 గంటకు ఆచార్య వరణం, వాస్తుశాంతి, అకల్మష హోమంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురార్పణం జరుగుతుందన్నారు. 27వ తేదీన అగ్ని మథనం, పంచాగ్ని ప్రణయనం, అగ్ని ప్రతిష్ట, బింబాత్ కుంభే కళాపకర్షణ, ఉపచార సమర్పణం, ఉక్త హోమాలు జరుగునని పేర్కొన్నారు.

ఈ నెల 29న సర్వ శాంతి, సహస్రాహుతి హోమాలు నిర్వహిస్తామని, 30వ తేదీన అష్టబంధన ద్రవ్యారాధనం, మహా శాంతి హోమాలు, ఉష్ణబంధనం, విశేష మహాశాంతి తిరుమంజనం, ధాన్యాధివాసం, సర్వదైవత్య హోమం, దోష ప్రాయశ్చిత్త హోమాలు నిర్వహిస్తారన్నారు. 31వ తేదీన ఉదయం మహా పూర్ణాహుతి అనంతరం చిత్త నక్షత్ర యుక్త తులాలగ్న శుభ ముహూర్తాన స్వామివారి ఆలయ ప్రవేశం చేస్తారని వివరించారు. 12ఏళ్లకోసారి జరిగే ఈ మహా క్రతువులో భక్తులందరూ వేలాదిగా పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయడం ద్వారా స్వామివారి కృపకు పాత్రులుకావాలని ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆలయ అర్చకులు వేదాంతం వెంకట శశికిరణ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ చేకూరి లలితా రమాదేవి, దాతలు మాకినేని విజయ్‌కుమార్, ఆర్.సంజీవరెడ్డి, ఎస్.వేణు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంని మర్యాదపూర్వకంగా కలిసిన ఎన్‌జీవో నేతలు

- ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకొచ్చిన విద్యాసాగర్
- నూతన నాయకత్వాన్ని అభినందించిన ముఖ్యమంత్రి



**అమరావతి, జులై 25, మేజర్ న్యూస్ :** ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర సంఘ అధ్యక్షులు, జేఏసీ ఛైర్మన్ ఎ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణలు వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు డిమాండ్లను, ఉద్యోగుల్లో ఉన్న ఆందోళనను, వారి మనోభావాలను ఎన్‌జీవో నేతలు రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి తెలియజేశారు. మర్యాదపూర్వక భేటీలో ఉద్యోగుల సమస్యలపై కూటమి ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉందని, ఆర్థిక పరిస్థితిలో తీవ్రమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ, స్నేహపూర్వక వాతావరణంలో దశలవారీగా ఉద్యోగులు సమస్యలను పరిష్కరించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. నూతనంగా ఎన్నికైన ఎ.విద్యాసాగర్, డీవీ రమణలను ముఖ్యమంత్రి అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

## సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఏ.సి.పి.లు



విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సాధారణ బదిలీల నేపధ్యంలో ఎన్.టి.ఆర్.జిల్లా మహిళా పోలీసు స్టేషన్‌లో ఏ.సి.పి.గా పని చేస్తున్న కె.లతా కుమారి ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో టాస్క్ ఫోర్స్ ఏ.సి.పి.గా బదిలీ అయినారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం శుక్రవారం పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబుని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

## నూతన ఏ.సి.పి. టి.దైవ ప్రసాద్



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సాధారణ బదిలీల నేపధ్యంలో కర్నూల్ రిజనల్ ఆఫీస్, సి.ఐ.డి.లో డి.ఎస్.పి.గా పని చేస్తున్న టి.దైవ ప్రసాద్ ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమిషనరేట్ మహిళా పోలీస్ స్టేషన్ ఏ.సి.పి.గా బదిలీ అయినారు.ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజ శేఖర బాబుని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, మైలవరం, విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999